నూతన చట్టాలతో ప్రమాదం

సీనియర్ న్యాయవాది విద్యాసాగర్‌రెడ్డి

సెమినార్‌లో మాట్లాడుతున్న విద్యాసాగర్‌రెడ్డి

ఖమ్మం కమాన్ బజార్, జూలై 14 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాలతో భావ వ్యక్తీకరణకు ప్రమాదం ఏర్పడిందని, ప్రశ్నించే తత్వాన్ని చంపేసే విధంగా చట్టాలు ఉన్నాయని సీనియర్ న్యాయవాది గంటా విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మంలోని స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పార్లమెంట్‌లో విపక్షాన్ని బయటకు పంపి 20 డిసెంబర్ 2023న కొత్త చట్టాలను తీసుకొచ్చారని పేర్కొన్నారు. కొన్ని కేసుల్లో పోలీసులకు విస్తృత అధికారం కల్పించడం సహేతుకం కాదన్నారు. ఈ సెమినార్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు దండి సురేశ్, మహ్మద్ మౌలానా, జానీమియా, న్యాయవాది శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక

సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

పెనుబల్లి, జూలై 14: 40 ఏళ్ల నాటి చిన్ననాటి స్నేహితులు పూర్వపు విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలు మధురస్మృతులను వల్లివేస్తూ రంగారావుబంజర గ్రామంలో ఆదివారం సందడి చేశారు. పెనుబల్లి మండలం వీఎం బంజర జిల్లా పరిషత్‌లో పదోతరగతి పూర్తి చేసిన వీరంతా రంగారావుబంజర గ్రామంలోని సోమరాజు సీతారామారావు స్వగృహంలో విద్యార్థులు కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో సోమరాజు సీతారామారావు, ఆచంట శ్రీనివాసరావు, మిట్టపల్లి జనార్ధన్, కాటినేని శ్రీనివాసరావు, జోనబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్య పట్టివేత


రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

తిరుమలాయపాలెం, జూలై 14: మండలంలోని పిండిప్రోలు లోగల గౌతమి జూనియర్ కళాశాల వెనుక ప్లాట్లలో నల్ల పట్టా కప్పి నిల్వ ఉంచిన 20 బస్తాల (10 క్వింటాళ్లు) రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు దీనిని దాచి ఉంచినట్లు గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ వీరయ్య, సిబ్బంది వెళ్లి సోదా చేశారు. బియ్యాన్ని స్వాధీనపర్చుకుని పంచనామా నిర్వహించారు. వర్షానికి తడిచి ముక్కపట్టి దుర్వాసన వస్తున్న ఆ బియ్యాన్ని ఊరి బయట గోతి తీయించి పూడ్చివేశారు.

22న తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నా

మాట్లాడుతున్న బందెల వెంకయ్య

తిరుమలాయపాలెం, జూలై 14: కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలన్న డిమాండుతో దశలవారీగా ఆందోళనలు నిర్వహించనున్నట్లు సీపీఐ(ఎంఎల్-మాస్‌లైన్) పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య తెలిపారు. మండలంలోని పిండిప్రోలులో ఆదివారం పార్టీ మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏకకాలంలో రైతుల రూ.2లక్షల రుణం మాఫీ చేయాలని; అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇళ్లు, పింఛన్లు ఇవ్వాలని; పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నా, 29న కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించనున్నట్లు చెప్పారు. వీటిని ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, మల్లయ్య, పులుగుజ్జు వెంకటస్వామి, బానోత్ శంకర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

భార్యతో గొడవ, క్షణకావేశం..

కుమార్తెతోపాటు 'పాలేరు'లో దూకబోయిన వ్యక్తి

రెండేళ్ల చిన్నారి చొక్కాకు రాళ్లు కట్టి ప్రాజెక్టులో పడేసే ప్రయత్నం

ఆ తరువాత తానూ జలాశయంలో దూకాలనే నిర్ణయం

క్షణాల్లో వచ్చిన కాపాడిన బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ బ్రహ్మం

కౌన్సెలింగ్ అనంతరం నరేశ్‌ను, అతడి రెండేళ్ల కుమార్తెను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

కూసుమంచి, జూలై 14: కుటుంబ కలహాలు, భార్యతో గొడవతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి క్షణికావేశానికి లోనయ్యాడు. పొంగి వచ్చిన కోపంలో అభం శుభం తెలియని రెండేళ్ల తన కుమార్తెను పాలేరులో పడేసి తానూ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. అంతే ఆవేశంతో పాలేరు జలాశయం వద్దకు చేరుకున్నాడు. ముందుగా కుమార్తెను రిజర్వాయర్‌లో పడేయాలని, పాప మళ్లీ పైకి తేలకుండా ఉండేలా చేయాలని భావించాడు. అందుకోసం చిన్నారి చొక్కాకు రాళ్లు కట్టాడు. ఆమెను జలాశయంలోకి వదిలేసే క్రమంలో క్షణాల్లో వచ్చిన బ్లూ కోల్ట్ కానిస్టేబుల్.. అతడి ప్రయత్నాన్ని అడ్డగించి పాపను చేతుల్లోకి తీసుకున్నాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కూసుమంచి మండలం జీళ్లచెరువు గ్రామానికి చెందిన జంపాల నరేశ్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సమస్యలతోపాటు భార్యతో గొడవ కారణంగా మనస్తాపం చెందాడు. క్షణికావేశానికి లోనై అదే మండలంలో ఉన్న పాలేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు. రెండేళ్ల వయసున్న తన కుమార్తెను కూడా వెంట తీసుకొని వచ్చాడు. పాలేరు రిజర్వాయర్ వద్దకు చేరుకున్నాక 100కు ఫోన్ చేశాడు. తన కుమార్తెను పాలేరులో పడేసి తాను కూడా బలవన్మరణం పొందాలని అనుకుంటున్నట్లు చెప్పి ఫోన్ కట్ చేశాడు. వెంటనే తన కుమార్తె షర్టుకు రాళ్లు కట్టి ఆమెను జలాశయంలోకి వదలే ప్రయత్నంలో ఉన్నాడు. అప్పటికే సమచారం అందినందున క్షణాల్లో అక్కడికి చేరుకున్న కూసుమంచి బ్లూకోల్ట్ కానిస్టేబుల్ బ్రహ్మం.. వెంటనే పాపను తన చేతుల్లోకి తీసుకున్నాడు. నరేశ్‌ను కూడా పక్కకు తీసుకొచ్చాడు. ఆ తరువాత అతడికి సర్దిచెప్పి వెంటనే పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చాడు. అక్కడ పోలీసులు అతడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. చిన్నారిని అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా, క్షణాల్లో స్పందించి మెరుపువేగంతో వెళ్లి ఇద్దరిని కాపాడిన బ్లూకోల్ట్ కానిస్టేబుల్ బ్రహ్మాన్ని పోలీసులు, మండల ప్రజలు అభినందించారు.

సింగరేణిలో బాంబు బ్లాస్టింగ్‌లతో ప్రజల హడల్

కూలుతున్న ఇళ్లు..

భయాందోళనలో సమీప గ్రామాల ప్రజలు

స్లాబ్‌పైపెచ్చు ఊడిపడిన దృశ్యం

బ్లాస్టింగ్‌ల కారణంగా నెర్రలు ఇచ్చిన గృహం

సత్తుపల్లిటౌన్, జూలై 14: సత్తుపల్లి సింగరేణి బొగ్గుగనుల్లో బొగ్గు వెలికతీత పనుల్లో భాగంగా ఉపయోగిస్తున్న బాంబు బ్లాస్టింగ్ వల్ల పట్టణంలోని ఎన్టీఆర్‌కాలనీ, వెంగళ్‌రావునగర్, కిష్టారంలోని ఎస్సీ, బీసీ కాలనీల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సత్తుపల్లి కేంద్రంగా కేవీఆర్ ఓసీ-1, ఓసీ-2, కిష్టారం ఉపరితల బొగ్గు గనుల నుంచి బొగ్గు వెలికి తీసేందుకు బాంబులను ఉపయోగిస్తుండటంతో బాంబు పేలుళ్లకు సమీప ప్రాంతాల్లోని ఇళ్లు కంపించి స్లాబ్ పెచ్చులు ఉడిపోతున్నాయి. శనివారం అర్ధరాత్రి పత్తిపాటి అశోక్, రాయల నాగేశ్వరరావు కుటుంబసభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా ఇంటి స్లాబ్ పెచ్చులు ఊడిపడడంతో కుటుంబ సభ్యులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బాంబు మోతల వల్ల కాలుష్యం, కట్టడాలు కంపిస్తున్నాయని అనేకమార్లు అధికారులకు మొర పెట్టుకున్నప్పటికీ అధికారుల నుంచి ఎటువంటి స్పందన లభించడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. గత ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లడంతో ఆయన సింగరేణి ఉన్నతాధికారుల బృందాన్ని కిష్టారానికి రప్పించి సమస్య వివరించారని, సింగరేణి ఉన్నతాధికారులు తమ ఇబ్బందులను త్వరలో తొలగిస్తామని చెప్పినప్పటికీ ఇప్పటి వరకు న్యాయం జరగలేదని బాధితులు పేర్కొంటున్నారు. కొమ్మేపల్లి నిర్వాసితులకు ఏ విధంగానైతే పునరావాస ప్యాకేజీను ప్రకటించారో తమకు కూడా ఇదే తరహాలో పునరావాసం ఏర్పాటు చేసి నష్టపరిహారం చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.. - కిష్టారం పీవో నర్సింహారావు

శనివారం రాత్రి బాంబు బ్లాస్టింగ్‌ల కారణంగా స్లాబ్ పైపెచ్చులు ఊడిపడి గాయాలపాలైన విషయాన్ని కిష్టారం సింగరేణి పీవో నర్సింహారావు దృష్టికి తీసుకెళ్లగా ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరలో సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని చెప్పారు.

పేద విద్యార్థులకు ఆర్థికసాయం

సాయం అందజేస్తున్న చెరుకూరి కృష్ణమూర్తి

హాజరైన చిరు వ్యాపారుల కుటుంబ సభ్యులు

ఖమ్మం వ్యవసాయం, జూలై 14: విద్యతోనే అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, నిరుపేదలకు విద్యే వజ్రాయుధమని వాసవి గార్డెన్ అధ్యక్షుడు చెరుకూరి కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం నగరంలోని కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వాసవి విద్యా పథకం పంపిణీకి ఆయన హాజరయ్యారు. వర్తకసంఘం అధ్యక్షుడు చిన్ని కృష్ణారావుతో కలిసి 'వాసవి విద్యాపథకం' ద్వార రూ.10 లక్షల విలువైన చెక్కులను పేద విద్యార్థులకు అందజేశారు. 80 మందికి రూ.10 వేలు, మరో 40మందికి రూ.5 వేల చొప్పున అందించారు. కురువెళ్ల లక్ష్మినారాయణ, శ్రీనివాసరావు, సాంబశివరావు, నగేశ్, ఈశ్వరరావు, ముత్తయ్య, కాంతారావు, హనుమంతరావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన సీపీఎం నాయకులు

గురుకుల పాఠశాలను సందర్శించి తనిఖీ చేస్తున్న సీపీఎం నేతలు

వైరాటౌన్/వైరా రూరల్, జూలై 14: గురుకులాల పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని రెబ్బవరంలోఉన్న మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను నాయకులు తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, కోట ప్రేమ్‌తో కలిసి సందర్శించారు. సొంత భవనం లేక సమస్యలు తాండవిస్తున్నాయని, సరిపోను మరుగుదొడ్లు లేవని, పురుగుల బియ్యంతో అన్నం పెడుతున్నారన్నారు. సివిల్ సప్లయ్ ద్వారా పాఠశాలకు సన్న బియ్యం సరఫరా చేయాలని తహసీల్దార్‌ను కోరారు. ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న గురుకుల పాఠశాల సమస్యలపై జిల్లా అధికార యంత్రాంగం పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు.

నివాళులర్పించిన బీఆర్ఎస్ నాయకులు

ఖమ్మం రూరల్, జూలై 14: మండలంలోని ఏదులాపురం సహకార సంఘం చైర్మన్ జర్పుల లక్ష్మణ్‌నాయక్ తల్లి సోనీ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. గుండాల తండా గ్రామంలో ఆదివారం ఆమె దశ దిన కర్మకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, జడ్పీటీసీ సభ్యుడు యండపల్లి వరప్రసాద్, నాయకులు రవి, బాలూనాయక్, యల్లయ్య నాయక్, యండపల్లి ఉపేందర్, బాలు, మల్లికార్జున్, సోమ్లా తదితరులు సోని చిత్రపటం వద్ద పూలు చల్లి నివాళులర్పించారు.

నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తల్లాడలో మొహర్రం వేడుకలు

పీరీలను ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

సత్తుపల్లి, జూలై 14: తల్లాడలో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం తల్లాడలోని పాతతహసీల్దార్ కార్యాలయం సమీపంలో నూతన పీర్ల సావిడి నుంచి పీర్లను తీసుకుని గ్రామంలోని పలు వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలు, డప్పువాయిద్యాలు నడుమ యువకులు కేరింతలు కొడుతూ పట్టణంలో ఊరేగించారు. అనంతరం పీర్ల చావిడి ఎదురుగా ఉన్న అగ్నిగుండం చుట్టూ తిరిగారు. కార్యక్రమంలో ముజావర్ షేక్ యూసూబ్, సేక్ మొహరాజ్, చాంద్‌పాషా, యాకుబ్‌పాషా, బడేమియా, నన్నేసా, బారెల్లి, బాబు, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాజకీయ తరగతులు ప్రారంభం

మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్ రావు

మధిర, జూలై 14: మండలంలోని దెందుకూరులోగల శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో సీపీఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శనరావు ఆదివారం ప్రారంభించారు. ముందుగా, పార్టీ పతాకాన్ని రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. పోతినేని మాట్లాడుతూ.. భవిష్యత్ పోరాటాలకు ఈ తరగతులు పునాదిగా ఉపయోగపడాలని అన్నారు. జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు యర్రా శ్రీకాంత్, బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, యనమదల విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ కార్యాలయంలో 'హెల్ప్‌లైన్'

ఖమ్మం, జూలై 14 : రానున్న వారంరోజులు అధిక వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. వర్షాల వల్ల ఇబ్బంది కలిగితే నగర ప్రజలు 7901298265 నెంబర్‌కి ఫోన్ చేసి సమస్యను వివరించవచ్చని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేలకొండపల్లిలో వైద్య శిబిరం

కూసుమంచి (నేలకొండపల్లి), జూలై 14: నేలకొండపల్లిలో ఆదివారం నూతక్కి గంగాధరరావు స్మారక ఉచిత వైద్య శిబిరం జరిగింది. డాక్టర్ గుడిపుడి రాజేశ్, డాక్టర్ కొల్లు అనుదీప్, గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు పుష్ప, నాగేశ్వరరావు, తానీష.. వైద్య సేవలు అందించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సత్తుపల్లిటౌన్, జూలై 14: వర్షాకాలంలో సీజనల్‌గా వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రజలకు సూచించారు. వర్షాల కారణంగా మంచినీరు కాలుషితం అయ్యే అవకాశం ఉందని, నీరు రంగు మారితే తప్పకుండా కాచి చల్లార్చి తాగాలని తెలిపారు. వేడివేడి ఆహారం, వేడి నీరు తీసుకోవాలన్నారు. జలుబు, జ్వరం, విరేచనాలు ఉంటే నిర్లక్ష్యం చేయవద్దని వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని కోరారు.

మున్సిపల్ ఆర్ఐ మృతి

మధిర, జూలై 14: మధిర మున్సిపల్ కార్యాలయంలో ఆర్ఐగా పనిచేస్తున్న కందుకూరి రాము(45) గుండెపోటుతో ఆదివారం మృతిచెందారు. ఆయన శనివారం కరీంనగర్ వెళ్లి, రాత్రి వేళ ఖమ్మం తిరిగొస్తుండగా గుండె నొప్పి వచ్చింది. ఖమ్మంలోని ప్రైవేట్ ఆసుపత్రికి కుటుంబీకులు తరలించారు. ఆయన అక్కడే ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

'గృహజ్యోతి' సవరణలకు అవకాశం

మధిర, జూలై 14: గృహజ్యోతి పథకం దరఖాస్తుదారులు సవరణలు చేయించుకునేందుకు ప్రభుత్వం అవకాశమిచ్చినట్లు మధిర విద్యుత్ శాఖ సబ్ డివిజన్ ఏడీఈ ఎం.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు గృహజ్యోతి పథకం లబ్ధి పొందని వారు మధిర మున్సిపాలిటీలో, మధిర, ఎర్రుపాలెం మండల పరిషత్ కార్యాలయాల్లో సంప్రదించవచ్చని సూచించారు. సర్వీస్ నంబర్ సరిచేయించడం, సర్వీస్ నంబర్‌కు రేషన్ కార్డును అనుసంధానించడం, ఇల్లు మారినప్పుడు ఆ ఇంటి సర్వీస్ నంబర్ కనెక్షన్‌తో అనుసంధానించడం వంటివి చేయించుకోవచ్చని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కారేపల్లి, జూలై 14: కారేపల్లి ఆదర్శ పాఠశాలలో 6 నుంచి 8వ తరగతులకు గణితం బోధించేందుకు అవర్లిబేస్ట్ టీచర్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మొహమ్మద్ అక్తర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ లేదా ఎంఎస్సీ బీఈడీ విద్యార్హత కలిగి ఉండాలని, బోధనలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఒక్కో పిరియడ్‌కు రూ.182 చొప్పున 100 పిరియడ్‌లకు మించకుండా గౌరవ వేతనం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 19వ తేదీన లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎంపికను ఇంటర్వ్యూ డెమో క్లాసుల ఆధారంగా జరుగుతాయని తెలిపారు.

సాయినాథుడికి అన్నాభిషేకం

ఖమ్మం, జూలై 14 : గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా ఖమ్మం నగరంలోని గాంధీచౌక్ శ్రీ వర ప్రదాత షిర్డీసాయి మందిరంలో ఆదివారం శ్రీ సాయినాథునికి అన్నాభిషేకం చేశారు. కార్యక్రమంలో మందిర చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, కురువెళ్ల జగన్మోహన్‌రావు, పొట్టి ప్రసాద్, సూరి, నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మేయర్ నీరజ

ఖమ్మం, జూలై 14 : ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను నగర మేయర్ పునుకొల్లు నీరజ ఆదివారం అందజేశారు. నగరంలోని వీడీఓస్ కాలనీలో గల మంత్రి తుమ్మల క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను అందించారు. కార్యక్రమంలో తుమ్మల యుగేంధర్, పలు డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు రాయలకు ఆత్మీయ సన్మానం

ఖమ్మం/రఘునాథపాలెం, జూలై 14: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన రాయల నాగేశ్వరరావును ఈ నెల 16వ తేదీ మంగళవారం ఘనంగా సన్మానించనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం నగరం మామిళ్లగూడెంలోని వీవీసీ ఫంక్షన్‌హాల్‌లో జరిగే కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

ఫుట్‌బాల్ పోటీల్లో ఖమ్మం జట్టుకు తృతీయస్థానం

విజేతలుగా నిలిచిన ఖమ్మం జిల్లా జట్టు

సత్తుపల్లి, జూలై 14: రాష్ట్ర స్థాయి బాలికల సబ్‌జూనియర్ ఫుట్‌బాట్ ఛాంపియన్‌షిప్ పోటీలు మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తిలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో జరిగాయి. ఖమ్మం జట్టు తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. జట్టులో సత్తుపల్లి బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన టీ తనుశ్రీ, కే ధనవర్ష జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారని జట్టు మేనేజర్ చీకటి శ్రీదేవి, ట్రైనర్ నోయల్ జాక్సన్ తెలిపారు. విజేతలను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

12.5 అడుగులకు చేరిన లంకాసాగర్ నీటిమట్టం

పెనుబల్లి, జూలై 14: రెండు రోజులుగా వర్షానికి లంకాసాగర్ ప్రాజెక్టులోకి 12.5 అడుగుల నీళ్లు వచ్చి చేరాయి. వరదతో వరి పొలాలు మొత్తం జలపాతం అయ్యాయి. వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు రెండు రోజులుగా వర్షం పడడంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వరదలతో నిండిన వరి పొలాలు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
TOURS & TRAVELS
★మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

జల్లేపల్లిలో ఉచిత వైద్య శిబిరం

తిరుమలాయపాలెం, జూలై 14: మండలంలోని జల్లేపల్లిలో ఆదివారం పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఖమ్మంలోని కిమ్స్ ఆసుపత్రి వైద్యులు నిర్వహించారు. దీనిని ఎంపీపీ బోడ మంగీలాల్ ప్రారంభించారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న 348 మందిని డాక్టర్ రంజిత్ రావెళ్ల, డాక్టర్ రవీంద్ర నాథ్ చౌదరి పరీక్షించారు. 118 మంది జ్వర పీడితులను గుర్తించారు. వీరికి ఉచితంగా మందులు ఇచ్చారు. కిమ్స్ ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ అనిల్, ఏఎన్ఎం నాగమణి, ఆశా వర్కర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616